ప్రచార పర్వం..

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఉదయం కాగానే ఆయా పార్టీల అభ్యర్థులు తమ బలగాన్ని తీసుకుని కాలనీలు, బస్తీల్లో దూసుకెళ్తున్నారు. తాము గెలిస్తే చేయాల్సిన అభివృద్ధి పనులు, తదితర వాటిపై హామీలు గుప్పిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి


మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: నియోజకవర్గంలో తాము చేసిన అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం బన్సీలాల్‌పేట్ డివిజన్ బీజేఆర్ నగర్, ముస్లింబస్తీ, వివేకానంద సంఘం ఏరియా, బన్సీలాల్‌పేట్ డీ క్లాస్, బండమైసమ్మ నగర్ మురికివాడల్లో ఇంటింటి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో రూ. కోట్లతో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. బండమైసమ్మనగర్‌లో నిర్మించిన 'డబుల్' ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోయాయన్నారు. బన్సీలాల్‌పేట్ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం క్వార్టర్స్ ప్రాంతంలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నిత్యం మీ మధ్యే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తనను ఓటుతో అభివృద్ధికి అండగా ఉండాలని కోరారు. ఈ ప్రచారంలో కార్పొరేటర్ కె. హేమలత, బీఆర్‌ఎస్ నాయకులు ప్రేమ్, రజాక్, అబ్బాస్, ఫయాజ్, లక్ష్మీపతి, జ్ఞానీ, రాజేందర్, బలరామ్, గోవర్ధన్ పాల్గొన్నారు.

ప్రజాశీర్వాదంతో హ్యాట్రిక్ సాధిస్తా


చిలకలగూడలో ప్రచారం చేస్తున్న పద్మారావుగౌడ్

చిలకలగూడ: నియోజకవర్గంలోని అన్నివర్గాల ప్రజల మద్దతుతో హ్యాట్రిక్ సాధిస్తానని సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. చిలకలగూడ, బడేమసీదు, చోటీ మసీదు, అన్నానగర్, కిందిబస్తీ, ఎరుకలబస్తీ, భవానీనగర్ తదితర ప్రాంతాల్లో శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించిన తమకే ఓటు అడిగే హక్కు ఉందన్నారు. స్థానికులు, ముస్లిం మైనారిటీలు, మత పెద్దలు సంపూర్ణ మద్దతు ప్రకటించారన్నారు. చిలకలగూడ బడేమసీదులో ప్రత్యేక నమాజ్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా ప్రాంత ప్రజలు పద్మారావుకు హారతులు ఇచ్చి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, శైలజ, సునీత, ప్రసన్నలక్ష్మీ, నాయకులు కిషోర్, కిరణ్, రామేశ్వర్, త్రినేత్ర, కరాటే రాజు, జలంధర్‌రెడ్డి, మహేందర్, చంద్రశేఖర్, నాగేందర్, వెంకటేష్, గౌడ్‌శ్రీను, నవీన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అందరికి న్యాయం


లాలాపేట ప్రచారంలో పాల్గొన్న ఆదం సంతోష్‌కుమార్

లాలాపేట: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే బడుగు, బలహీన వర్గాలందరికి న్యాయం జరుగుతుందని.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతుందని సికింద్రాబాద్ అభ్యర్థి ఆదం సంతోష్ కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం లాలాపేట, సత్యానగర్, ఇందిరానగర్, శ్రీపురి కాలనీ, చంద్రబాబునగర్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర చేస్తూ తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఇంత కాలం ఇక్కడి ఎమ్మెల్యే తీరుతో నియోజకవర్గం వ్యాప్తంగా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని తార్నాక డివిజన్ లాలాపేట సాయినగర్‌లో చేపట్టిన డబుల్ బెడ్రూమ్‌లు ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికి పూర్తి చేయలేదని విమర్శించారు. స్థానికంగా ఉన్న స్థితిగతులపై పూర్తి అవగాహన ఉన్న తనకు ఈ పర్యాయం అవకాశం కల్పించాలన్నారు. ప్రచారంలో రామ్‌లాల్, అమర్నాథ్‌గౌడ్, చింతల్ కిట్టు, అనీల్, కిషోర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ విజయం ఖాయం


ఒకటో వార్డులో ప్రచారం చేస్తున్న మహేశ్వర్ రెడ్డి

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో బీఆర్‌ఎస్ విజయం ఖాయమని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం ఒకటో వార్డు పరిధిలోని చిన్నతోకట్టా, ఎస్‌ఎన్ కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమ రంగంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో మూడోసారి బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలకు రెట్టింపు ప్రయోజనం కలుగుతుందన్నారు. ముఖ్యంగా కంటోన్మెంట్ ప్రాంత వాసులకు మిలటరీ ఆంక్షల నుంచి విముక్తి కలుగుతుందన్నారు. ప్రచారంలో రాజు, బంగారు రాము, చందు, విజయ్, రమేశ్, టింకూ, నర్సింగ్ రావు, హసీన్ ఖాన్, పద్మ, అనిత, అంబిక, భాగ్య, బౌరుద్దీన్, జైహింద్, చిన్నా, ముఖ్తర్, నర్సింగ్ రావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ విజయంతోనే అభివృద్ధి


ఇంటింటి ప్రచారంలో మహేశ్వరిశ్రీహరి

సనత్‌నగర్: బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయంతోనే అభివృద్ధి కొనసాగింపు జరుగుతుందని బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి అన్నారు. బేగంపేట డివిజన్ పరిధిలో సనత్‌నగర్, కూకట్‌పల్లి అభ్యర్థులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాధవరం కృష్ణారావును భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరి మాట్లాడుతూ.. మునుపెన్నడూ జరగని అభివృద్ధి తొమ్మిదిన్నర ఏళ్లలో జరిగిందన్నారు. ప్రతినిత్యం ప్రజల కోసం ఆలోచించే అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా నిరంతర అభివృద్ధికి ఎలాంటి ఆటంకం ఉండదన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

అభ్యర్థుల టార్గెట్.. మురికివాడల ఓట్!



ఎన్నికలు వచ్చాయంటే చాలు.. అభ్యర్థులెవరని తేలగానే వారు మొదటగా మురికివాడలు, బస్తీలపై ప్రత్యేక దృష్టి సారిస్తుంటారు. ప్రధానంగా హైదరాబాద్ నగరంలో ఆ ఓటర్లను ప్రసన్నం చేసుకోడానికి అన్ని పార్టీల అభ్యర్థులు తమదైన శైలిలో కసరత్తులు చేస్తుంటారు. సామాన్యులుగా పిలువబడే మురికివాడలు, బస్తీల్లో ఎక్కువ శాతం ఓటింగ్ నమోదు అవుతుండటంతో తమ నియోజకవర్గంలో ఎన్ని బస్తీలు, మురికివాడలుగా పిలువబడే ప్రాంతాలు ఉన్నాయో గుర్తించి మొదటగా ఈ ప్రాంతాల్లోనే ప్రచారం చేస్తుంటారు. – బన్సీలాల్‌పేట్

జంగ్ తెలంగాణ 2023

- మాస్ ఓటర్లపైనే ప్రత్యేక గురి
- ఎవరికో ఈ సామాన్యుడి మద్దతు
- అంతుచిక్కని ఓటరు నాడీ

కీలక నిర్ణేతలుగా..

ఏ నియోజకవర్గంలోనైనా ఓ అభ్యర్థి గెలువాలన్నా.. ఓటమి రుచి చూడాలన్నా.. ఆ పేద ప్రజలే కీలక నిర్ణేతలుగా ఉంటారు. ఎక్కడైనా ఈ వర్గమే మెజారిటీ సంఖ్యలో ఉంటుంది. సనత్‌నగర్ నియోజకవర్గంలో 2 లక్షల 25 వేల మంది ఓటర్లు ఉంటే అందులో 80 శాతం ఈ సామాన్యులు, అతి సామాన్యులే ఎక్కువ. మురికివాడలు, చిన్నపాటి బస్తీల్లో నివసించే పేదలే ఈ సామాన్యులు. కానీ.. రాజకీయ నాయకులకు మాత్రం వీళ్లు సామాన్యులు కారు. తమకు రాజకీయ జీవితాన్ని ప్రసాదించే దేవుళ్లు. ఆయా మురికివాడలు, బస్తీల్లో ఎక్కువగా కాయకష్టం అంటే రోజు వారీ కూలీలు, వ్యాపార సంస్థల్లో చిన్నపాటి ఉద్యోగులు, ఇళ్లలో పాచీపని చేసే మహిళలే మెజారిటీ సంఖ్యలో ఉంటారు.

సనత్‌నగర్‌లో..

సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మెజారిటీ సంఖ్యలో బస్తీలు, మురికివాడలు ఉన్నాయి. హమాల్‌బస్తీ, రైల్ కళా రంగ్ బస్తీ, సుందరయ్య వీకర్ సెక్షన్స్, ఐడీహెచ్ కాలనీ, బండమైసమ్మనగర్, చాచానెహ్రూనగర్, బన్సీలాల్‌పేట్, జెజె హౌసింగ్ కాలనీ, విక్టోరియాగంజ్, బర్తన్ కంపౌండ్, వెంగళరావునగర్, కస్తూర్బానగర్, అంబేడ్కర్‌నగర్, కాచిబౌలి, శ్యామలకుంట, బీజేఆర్‌నగర్, పాటిగడ్డ తదితర అనేక మురికివాడలతో పాటు పేదల బస్తీలకు కేంద్ర బిందువు ఈ నియోజకవర్గం. పైకి చూస్తే వ్యాపార కేంద్రాలు, సంపన్నులు నివసించే పెద్ద పెద్ద కాలనీలు కనిపిస్తాయి. కాని తరిచి చూస్తే ఈ మురికివాడలు కనిపిస్తాయి. అయితే వ్యాపారులు వివిధ వృత్తి నిపుణులు అంటే డాక్టర్లు, న్యాయవాదులు, ఇంజనీర్లు, సాఫ్ట్‌వేర్ నిపుణులు ఇక్కడ ఉన్నప్పటికి వాళ్లంతా చదువుకున్న మేధావులు. ఏ పార్టీకి ఏ అభ్యరికి ఎందుకు ఓటు వేయాలనేది ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు. అంతే కాదు ఈ సంపన్న వర్గాల్లో చాలా తక్కువ మంది మాత్రమే ఓటింగ్‌లో పాల్గొంటారనేది ఇప్పటి వరకు జరిగిన అన్ని ఎన్నికల పోలింగ్ శాతం సూచిస్తుంది. నగరంలోని ఏ నియోజకవర్గమైనా 60 శాతం మించి పోలింగ్ కాకపోవడాన్ని దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

హామీల వర్షాలు..

ఆయా బస్తీల పేదలతో పాటు అక్కడ ఉండే మహిళా పొదుపు సంఘాలు, కుల సంఘాలు, యువజన సంఘాలు, బస్తీ సంఘాల ప్రతినిధులను తమ వైపు తిప్పుకోడానికి అన్ని పార్టీల అభ్యర్థులు అన్ని రకాల ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రతి సంఘం ప్రతినిధులతో సమావేశమై వాళ్ల సమస్యలు, అవసరాలు, సాధక బాధలు తెలుసుకొని ఆర్థికంగా ఆదుకోవడానికి ప్రయత్నిస్తున్నారని సమాచారం. అంతే కాకుండా తాము తిరిగి ఎన్నికైతే మహిళా సంఘాలకు రెట్టింపు స్థాయిలో రుణాలు ఇప్పించడం బస్తీల్లో వివిధ పథకాల పేర్లు, యువతకు ఉద్యోగ విషయంలో అవసరమైన శిక్షణ ఇప్పిస్తామని హామీలు ఇస్తున్నారు. అధికార పార్టీ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కోట నీలిమ, బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డిలు బస్తీలు, మురికివాడలను టార్గెట్‌గా ఎన్నికల ప్రచారం కొనసాగిస్తున్నారు. ఓటింగ్‌ను ప్రభావితం చేసే వ్యక్తులు, శక్తులను తమవైపు తిప్పుకునేలా విశ్వప్రయత్నాలు సాగిస్తున్నారు. ఏ చిన్న అవకాశాన్ని చేజార్చుకోకుండా వారు తమదైన శైలిలో ప్రణాళికలు రూపొందిస్తున్నారు.



ఎటు వైపో?..

ప్రతి ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయించడంలో కీలక పాత్ర పోషించే ఈ సామాన్యులు అసామాన్యులు ఎవరి వైపు అనేది ఎప్పటికప్పుడు అంతుచిక్కని ప్రశ్నే ఓ సారి ఓ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే మరోసారి మరో పార్టీని గెలిపించడం ఈ నియోజకవర్గంలో జరుగుతూ వస్తోంది. ఈ సారి ఈ వర్గం అధికార పక్షం వైపు నిలుస్తుందా? ప్రతిపక్షంలో ఉన్న అభ్యర్థిని గెలిపిస్తుందా అనే అంశంపై రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

బీజేపీ విజయానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న బంగారు శ్రుతి

లాలాపేట: సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీజేపీకి ప్రజలందరీ మద్దతు ఉందని ఆ పార్టీ అభ్యర్థి మేకల సారంగపాణి అన్నారు. తార్నాక మర్రి కృష్ణా ఫంక్షన్ హాల్లో శనివారం నిర్వహించిన నియోజకవర్గ మహిళా సదస్సులో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ.. నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం పని చేస్తున్న సారంగపాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మహిళలను కోరారు. మహిళా సంక్షేమం కోసం కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. గత పదేళ్లుగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే నియోజకవర్గం అభివృద్ధిని పట్టించుకోలేదని కాబట్టి ఓటు అడిగే హక్కు పద్మారావుకు లేదన్నారు. ఈ సదస్సులో రాజశేఖర్‌రెడ్డి, అనిత, శారదా మల్లేష్, అనూష, నాగమల్లేశ్వరీ, సత్యవతి, భానుమతి, సరోజ, శోభ, కళావతి, మేకల కీర్తి, దుర్గా, లావణ్య, సుజాత పాల్గొన్నారు.

దేశం గర్వించే స్థాయికి చేరుకోవాలి

హైకోర్టు న్యాయమూర్తి ఈవీ వేణుగోపాల్



సమావేశంలో పాల్గొన్న ఈవీ వేణుగోపాల్

రాంగోపాల్‌పేట్: విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుని దేశం, కుటుంబం గర్వించే స్థాయికి చేరుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి ఈవీ వేణుగోపాల్ అన్నారు. శనివారం సికింద్రాబాద్‌లోని హరిహరకళాభవన్‌లో నిర్వహించిన రుక్మిణి కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ 5వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానంతో చేతి వేళ్లపైనే సమస్త సమాచారం ఉందని, దాన్ని మంచికి ఉపయోగించుకుని మరింత విజ్ఞానాన్ని పొందాలన్నారు. విద్యార్థి దశలో విద్యతో పాటు సమాజ సేవ, కళలు తదితర అంశాల్లో కూడా వారిని ప్రోత్సహించాలని సూచించారు. నేటి విద్యార్థులే రేపటి నమ్మకం అని దేశం, సమాజానికి ఉపయోగపడేలా తయారవ్వాలని అన్నారు. ఇటీవల చంద్రయాన్–3 విజయవంతం కావడం మనదేశ సాంకేతిక పరిజ్ఞానం ఏంటో ప్రపంచ దేశాలకు తెలిసిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పి కృష్ణారావు, డైరెక్టర్ నాగరాజు, వికాస్, ప్రిన్సిపాల్ జ్యోతి పాల్గొన్నారు.

అభ్యర్థులకు వినతిపత్రాలు సమర్పించాలి


మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

అడ్డగుట్ట: బస్తీలలో ఎన్నికల ప్రచారాలకు వచ్చే అభ్యర్థులకు పిల్లల హక్కులకు సంబంధించిన వినతిపత్రాలు సమర్పించాలని తెలంగాణ తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లోని పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తెలంగాణ తల్లుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో భాగ్యలక్ష్మి పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికల నేపథ్యంలో వివిధ పార్టీలు ప్రకటించిన మేనిఫెస్టోలో పిల్లల ఎజెండా, హక్కులను మరిచిపోయారని అందుకే ప్రచారాల్లో భాగంగా బస్తీలకు వచ్చే అభ్యర్థులకు పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించాలని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో లక్ష్మీనారాయణ, ప్రవీణ్ కుమార్, మహేందర్, జమున, రామలీల, లక్ష్మి, పుష్ప, రబ్బాని, ప్రకాష్, సువర్ణ, భాగ్య, సుమలత పాల్గొన్నారు.

వినూత్న ప్రచారం



రాంగోపాల్‌పేట్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే గ్యాస్ సిలిండర్‌పై రూ.400 సబ్సిడీ వస్తుందంటూ రాంగోపాల్‌పేట్‌లో మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ గ్యాస్ సిలిండర్లతో వినూత్న ప్రచారం చేపట్టారు. వివిధ ప్రాంతాల్లో ఆమె ఇంటింటికి వెళ్లి మోదీ హయాంలో గ్యాస్ సిలిండర్ ధర పేద, మధ్య తరగతి ప్రజలకు గుదిబండలా మారిందని వివరించారు. డివిజన్‌లో జరిగిన అభివృద్ధిని గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వినోద్, రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

అభ్యర్థుల వ్యయ, గణనపై దృష్టి పెట్టాలి

సనత్‌నగర్: ఎమ్మెల్యే అభ్యర్థుల వ్యయ పరిశీలకురాలు డాక్టర్ నీతూ అగర్వాల్ శనివారం ఎన్నికల సిబ్బందితో సమావేశమయ్యారు. ఆర్వో కిషన్‌రావుతో కలిసి ఆమె అసిస్టెంట్ ఈఓ శంకర్‌తో పాటు ఫ్లైయింగ్ స్క్వాడ్ (ఎఫ్‌ఎస్‌టీ), స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీమ్ (ఎస్ఎస్‌టీ), వీడియో ఫ్యూయింగ్ టీమ్ (వీవీటీ) లకు చెందిన అధికారులతో సమావేశమై ఆయా టీమ్‌ల విధి నిర్వహణ గురించి తెలుసుకున్నారు. అభ్యర్థి నామినేషన్ వేసిన దగ్గర నుంచి వ్యయ గణన చేపట్టాల్సి ఉండటంతో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రచారం, సమావేశాలు, సభలు.. అభ్యర్థి చేపట్టే కార్యక్రమాలకు అయ్యే ఖర్చు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసేలా సిద్ధంగా ఉండాలన్నారు.



బీఆర్‌ఎస్‌లోకి టీడీపీ నాయకులు

చిలకలగూడ: చిలకలగూడకు చెందిన పలువురు సీనియర్ టీడీపీ నాయకులు బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావు సమక్షంలో టీడీపీ నాయకులు కాసరబాద కనకయ్య, మల్లేష్‌యాదవ్, నర్సింగ్‌యాదవ్ బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన పలు పార్టీలకు చెందిన నాయకులు, యువత బీఆర్‌ఎస్‌లో చేరేందుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని పద్మారావు అన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జలంధర్‌రెడ్డి, కాసరబాద వెంకటేష్, చంద్రశేఖర్,

'నామినేషన్ పత్రాలకు వెళ్తే పోలీసులు అడ్డుకుంటున్నారు'

రాంగోపాల్‌పేట్: సనత్‌నగర్ నియోజకవర్గంలో తమ అభ్యర్థిని బరిలో నిలిపేందుకు నామినేషన్ పత్రాలు తీసుకునేందుకు వెళ్తే పోలీసులు కార్యాలయం లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారని జన తెలంగాణ రైట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు వడ్డెం శ్యామ్ ఆరోపించారు. శనివారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలోని రిటర్నింగ్ కార్యాలయానికి వెళ్లగా అక్కడ ఉండే ఓ ఇన్‌స్పెక్టర్ నామినేషన్ వేసే వాళ్లకు ఇబ్బంది వస్తుందని మూడు గంటల తర్వాత ఇతరులను లోపలికి పంపమని ఆర్వో ఆదేశాలున్నాయని అన్నారన్నారు. దీనిపై ఆర్వోను ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా స్పందించలేదన్నారు. చాలా సేపటి తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాలతో లోపలికి అనుమతించారని తెలిపారు. జోనల్, సికింద్రాబాద్, బేగంపేట సర్కిల్ కార్యాలయాలు కొనసాగుతుండగా ఆయా పనుల నిమిత్తం వచ్చే ప్రజలను కూడా నిబంధనల పేరుతో పోలీసులు అడ్డుకుంటున్నారని వాపోయారు.

నేడు 'మ్యాన్ కైండ్ పెట్‌స్టార్' మారథాన్

సనత్‌నగర్: తెలంగాణ కెనైన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నెక్లెస్‌రోడ్డు కేంద్రంగా 'మ్యాన్ కైండ్ పెట్‌స్టార్' మారథాన్ నిర్వహించనున్నారు. ఇందులో వివిధ జాతులకు చెందిన పెట్స్ (కుక్కలు) పోటీ పడనున్నాయి. ఇప్పటివరకు మారథాన్‌లో పోటీపడే క్రీడాకారులను చూసిన అభిమానులు..ఆదివారం పెట్స్ మారథాన్‌ను తిలకించనున్నారు. నెక్లెస్‌రోడ్డులోని రైల్ కోచ్ రెస్టారెంట్‌లో ఉదయం 7 గంటలకు పెట్స్ మారథాన్ ప్రారంభమవుతుందని అసోసియేషన్ కార్యదర్శి విశాల్ సూదం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.మిస్టర్ పెట్‌స్టార్, మిసెస్ పెట్‌స్టార్, బెస్ట్ పప్పీ, బెస్ట్ వెటరన్ కేటగిరిల్లో మారథాన్ కొనసాగుతుందన్నారు.

మినీ గోల్ఫ్‌లో సత్తా



రాంగోపాల్‌పేట్: 37వ నేషనల్ గేమ్స్ మినీ గోల్ఫ్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణకు చెందిన క్రీడాకారులు రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఈ నెల 1 నుంచి 3 వరకు గోవాలో పోటీలు జరిగాయి. శుక్రవారం జరిగిన మిక్స్ డబుల్స్ ఫైనల్‌లో మహేక్ సింగ్, చిన్న ముదిరాజ్ బ్రాంజ్ మెడల్ సాధించగా విమెన్స్ మిక్స్‌డ్ డబుల్స్‌లో మానస, వర్ష బ్రాంజ్ మెడల్ సాధించారు. సీఎం మల్లారెడ్డి, తెలంగాణ మినీ గోల్ఫ్ ప్రెసిడెంట్ కట్టా శ్రీను, కార్యదర్శి శరద్ సింగ్ ఠాకూర్ క్రీడాకారులను అభినందించారు.

కంటోన్మెంట్‌లో తొలి నామినేషన్


నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న భాస్కర్


కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి శ్రమజీవి పార్టీ తరఫున జాజుల భాస్కర్ (48) తొలి నామినేషన్ దాఖలు చేశారు. ఓల్డ్ అల్వాల్ ప్రాంతానికి చెందిన భాస్కర్ ఎస్సీ– మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. ఈయన మల్కాజ్‌గిరి అసెంబ్లీ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేయడం గమనార్హం. శనివారం రిటర్నింగ్ అధికారి మధుకర్ నాయక్‌కు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

ఉత్సాహంగా 'సమగ్రత వాకథాన్'


విజిలెన్స్ అవగాహన ర్యాలీలో అరుణ్ కుమార్ జైన్

అడ్డగుట్ట: నిఘా అవగాహన వారోత్సవాల్లో భాగంగా దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో శనివారం సికింద్రాబాదలోని ఆర్ఆర్‌సీ గ్రౌండ్‌లో 'సమగ్రత(ఇంటిగ్రిటీ) వాకథాన్'ను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీకి జీఎం అరుణ్‌కుమార్ జైన్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో సమగ్రత, నిస్వార్థం పెంపొందించడానికి ఈ ర్యాలీలు ఉపయోగపడుతాయన్నారు. అదే విధంగా అవినీతి ప్రతికూల ప్రభావాన్ని ప్రచారం చేయడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించడానికి దోహదపడుతాయని చెప్పారు. సమాజ అభివృద్ధిలో అవినీతి ఒక పెద్ద లోపమని, దానిని నిర్మూలించాలన్నారు. అన్ని డివిజన్‌లతో పాటుగా మూడు ప్రధాన వర్క్‌షాపులలో, ఫీల్డ్ యూనిట్లలో అవినీతిని రూపుమాపడానికి రైల్వే సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించడానికి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

కాన్పు భయాలను తొలగించాలి


మాట్లాడుతున్న వైద్య నిపుణులు

సనత్‌నగర్: కాన్పుల భయాలను తొలగించి సాధారణ ప్రసవాలను పెంచాలని వైద్య నిపుణులు సూచించారు. శనివారం ఫెర్నాండెజ్ ఆస్పత్రిలో వినూత్న సదస్సు నిర్వహించారు. పలు రంగాల్లో పనిచేస్తూ మాతృత్వం పొందిన తల్లులను ఆహ్వానించి ప్రసవం సమయంలో వారు ఎదుర్కొన్న అనుభవాల సారాన్ని ఆ వేదికపై ఆవిష్కరింపజేశారు. ఫెర్నాండెజ్ హాస్పిటల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్, యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ సంయుక్తంగా అమీర్‌పేట మ్యారీగోల్డ్ హోటల్‌లో రెండు రోజుల పాటు జరిగే 'బెటర్ బర్తింగ్ ఎక్స్‌పీరియన్స్' సదస్సు శనివారం ప్రారంభమైంది. దీనికి వివిధ రాష్ట్రాలతో పాటు కువైట్, యూకే దేశాల నుంచి నిపుణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ ఎవిటా ఫెర్నాండెజ్ మాట్లాడుతూ.. గర్భిణులు మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే కాన్పు సమయంలో క్లిష్ట పరిస్థితులు ఉత్పన్నమైనప్పటికీ సులభంగా అధిగమించవచ్చన్నారు. గతంలో తాము వివిధ రకాల ఆరోగ్య సమస్యలపై సదస్సులను నిర్వహించామని, అయితే మొట్టమొదటి సారిగా ప్రసవం సమయంలో మహిళలు ఎదుర్కొంటున్న భయాందోళనలను తొలగించాలనే లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహించడం జరిగిందన్నారు. రెండోసారి కాన్పుకు మహిళలు ఎంతో భయపడుతుంటారని, అలాంటి భయాలను తొలగించి సాధారణ ప్రసవాలను పెంచాలన్నదే తమ ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రసవం నిమిత్తం ఆస్పత్రికి వచ్చే గర్భిణులతో ఆత్మీయంగా మాట్లాడి వారిలో ఉన్న భయాలను దూరం చేయాలన్నారు. చాలామంది వారి భయాలను తెలుసుకునే ప్రయత్నం చేయకుండా సిజేరియన్ చేసేందుకే ఆసక్తి కనబరచడం ఒకింత బాధాకరమన్నారు. సాధ్యమైనంత వరకు సహజ పద్ధతుల్లో నొప్పులు తగ్గించే ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మిడ్‌వైఫరీ డైరెక్టర్ ఇంద్రజిత్‌కౌర్, తదితరులు పాల్గొన్నారు.